



## ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- జిల్లా ఎస్పీ దామోదర్


RK అగ్ని న్యూస్

The Power Of Truth

9441533080 - 8309890844

అక్టోబర్ : 11 శుక్రవారం సంపుటి : 28 సంచిక : 243


## మద్యం దుకాణాల విషయం లో సిండికేట్ అయితే చర్యలు



**- నిర్భయంగా మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోండి**

**- ఎక్సైజ్ ఎఈఎస్ బాలయ్య**

అగ్ని న్యూస్,మార్కాపురం (అక్టోబర్ 10) : నూతన ఎక్సైజ్ పాలసీ ద్వారా మద్యం షాపులకు దరఖాస్తులు చేసుకునేవారు నిర్భయంగా దరఖాస్తు చేసుకోవచ్చని మార్కాపురం ఎక్సైజ్ ఏ ఈ ఎస్ దాసరి బాలయ్య బరోసా ఇచ్చారు.దరఖాస్తులు,దుకాణాల ఏర్పాటు విషయంలో సిండికేట్ అయితే కఠినచర్యలు తీసుకుంటామని చెప్పారు.ఆయన గురువారం మధ్యాహ్నం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.ఒక్కో షాపుకు


2 లో


## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



**- జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా**

అగ్ని న్యూస్,యర్రగొండపాలెం (అక్టోబర్ 10): రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా ,వైద్యులకు సూచించారు.గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా,యర్రగొండపాలెం కమ్యూనిటి హెల్త్ సెంటర్ ను ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఎన్ టి ఆర్ వైద్య సేవల కౌంటర్ ను,రోగుల రిజిస్ట్రేషన్ రూమును సందర్శించి రిజిస్ట్రేషన్ రికార్డ్స్ ను, స్త్రీ లు,


2 లో


# ముసుగు వేశారు... మూత తీశారు..!





## తెర వెనుక సూత్రదారి ఎవరు ?



(అగ్ని ప్రతినిధి, మార్కాపురం)

మార్కాపురం పట్టణంలో మద్యం వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతుంది. ప్రభుత్వ అనుమతులు, నిబంధనలు తుంగలో తొక్కి లాభార్జన ధ్యేయంగాకొన్ని షాపులు ఇష్టారీతిగా వ్యాపారం సాగిస్తున్నాయి. పట్టణంలోని కంభం రోడ్ లో ఉన్న రెస్టారెంట్ ఇందుకు ఉదాహరణగా నిలిచింది. బయట ఉండే బోర్డు కి ముసుగు వేసినపెద్ద మనుషులు, లోపల ఎంచక్కా మద్యం బాటిళ్లు విక్రయించుకుంటూ, రెస్టారెంట్ దర్జాగా నడుపుతున్న వైనం ఇది. మద్యం నూతన పాలసీ విధానం ప్రకారం, సక్రమంగా నిర్వహిస్తున్నామని మాటలు చెప్పే అధికారులు, ప్రధాన వీధిలో ఉండే ఈ రెస్టారెంట్ కి ముసుగేందుకేశారు?లోపల యధేచ్ఛగా విక్రయాలు ఎలా సాగిస్తున్నారనే విషయంపై దృష్టి సారించక పోవడం గమనించాల్సిన విషయం. నిజానికి మార్కాపురం పట్టణంలో ఐదు బార్ అండ్ రెస్టారెంట్లు ఉండగా కేవలం నాలుగు రెస్టారెంట్ లకు మాత్రమే ప్రభుత్వం రెన్యువల్ ఇచ్చింది. మిగతా ఐదో రెస్టారెంట్ ఎలా సాగుతుంది? బోర్డు కు ముసుగేసినంత మాత్రాన మద్యం విక్రయాలు ఎలా కొనసాగుతున్నాయి? అసలు ఈ రెస్టారెంట్ కి మద్యం సరఫరా ఎలా జరుగుతుంది? ఇవన్నీ ఎక్సైజ్ అధికారులకు తెలియకుండానే సాగుతున్నాయా? అంటే నమ్మేందుకు ఎవరు సిద్ధంగా లేరు మరి అధికార పార్టీ ప్రతినిధులు దీనికి వెనకనుంచి నడిపిస్తున్నారా?. అధికార పార్టీ నాయకుల అడుగుజాడల్లోనే ఈ రెస్టారెంట్ వ్యాపారం కొనసాగిస్తుందా ? అని జనం గుసగుసలాడుకుంటున్నారు. మరి ఎక్సైజ్ అధికారులు ఈ రెస్టారెంట్ పై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

## ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

**మొదటి పేజీ తరువాయి**

అగ్ని న్యూస్, ఒంగోలు (అక్టోబర్ 10): జిల్లాలో రౌడీయిజం చేస్తే సహించేది లేదని జిల్లా ఎస్పీ దామోదర్,రౌడీ మూకలకు హెచ్చరికలు జారీ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత నెల 4 వ తేదీ ఒంగోలు సీతారామపురం కు చెందిన దనిశెట్టి జానకి రామ్ పై మున్సిపల్ ఆఫీసు దగ్గరలో పూజారి దేవ, ఆవుల అనీల్ చిన్నోడు అలియాస్ డేవిడ్ బిల్లా, శివ అను వారు దాడి చేసినట్లు తెలిపారు. ఉంగరాల సాయి కృష్ణ అను అతని పై హరీష్ ,జాన్సన్, అగస్టీన్ అను వారు సాయికృష్ణ పై దాడిచేసిన సంఘటనలోను అందరిపై ఒంగోలు ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్ లో హత్యాయత్నం,వివిద సెక్షన్ల క్రింద కేసులు నమోదు చేసి వారిని జైలుకు పంపించామని తెలిపారు.జిల్లాలో రౌడీ కార్యకలాపాలకు, నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని, రౌడీయిజముతో చేసిన చిన్న సంఘటనైనా తీవ్రముగా పరిగణించి వారిపై కఠిన చర్యలు తీసుకోవటం, రౌడీ షీట్లు ఓపెన్ చేయటం జరుగుతుందని హెచ్చరించారు. వారిపై నిరంతరముగా పోలీసు నిఘా ఉంటుందని హెచ్చరించారు.

## మద్యం దుకాణాల విషయం లో సిండికేట్ అయితే చర్యలు

**మొదటి పేజీ తరువాయి**

పది కన్నా తక్కువ దరఖాస్తులు వస్తే రిటెండర్ వేస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇప్పటివరకు మద్యం వ్యాపారం చేసిన వారు తిరిగి మద్యం వ్యాపారం కోసం దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. నూతన ఎక్సైజ్ పాలసీలో తక్కువ ధరకే నాణ్యమైన మద్యం ప్రజలకు అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు. వ్యాపారస్తులకు లాభాలు ఉండే విధంగా 20 శాతం వరకు కమిషన్ వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. దరఖాస్తులు రాకుండా ఎవరైనా సిండికేట్ గా వ్యవహరిస్తే ఇంటెలిజెన్సీ నిఘా వర్గాల ద్వారా గుర్తించి, వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది అని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వంసెబ్ ను రద్దు చేసి నూతన ఎక్సైజ్ పాలసీ అమలు చేస్తుందని అన్నారు. ఈ పాలసీ ప్రకారం ప్రజారోగ్యం, ప్రభుత్వ ఆదాయం రెండింటికీ ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. విలేకరుల సమావేశంలో సర్కిల్ ఇన్స్పెక్టర్లు వెంకటరెడ్డి , గౌస్ బాషా పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**మొదటి పేజీ తరువాయి**

పురుషుల సర్జికల్ వార్డులను, డయాలసిస్, క్యాజువాలిటి రూములను, అత్యవసర సేవా విభాగంను, కాన్పులు, పిల్లల వార్డులను , నవజాత శిశు సంరక్షణ కేంద్రంను, ఐటిడిఎ ప్రత్యేక వార్డును తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు.ఆసుపత్రి లో వైద్య సేవలు ఎలా అందుతున్నాయి, వైద్యులు సక్రమంగా చూస్తున్నారా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్,వైద్యులకు సూచించారు. ఆసుపత్రి కి కొంత భాగం కాంపౌండ్ వాల్ నిర్మించాల్సి వుందని, అలాగే ఆసుపత్రి ఆవరణలో లెవలింగ్ చేయాల్సి ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. యదీద్యా, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, తహశీల్దార్ బాల కిషోర్, ఎంపిడిఓ,శ్రీనివాసరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా యదీద్యా, ఇతర అధికారులు ఉన్నారు. తొలుత యర్రగొండపాలెం లో నూతనంగా నిర్మించిన రైతుబజార్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.రైతు బజార్ ఆవరణలో లెవలింగ్ చేయాలని జిల్లా కలెక్టర్,మార్కెటింగ్ శాఖ ఎడి ఉపేంద్ర కుమార్ ను ఆదేశించారు.

## కందుల గౌతమ్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో 100 మందికి వస్త్రాలు పంపిణీ



అగ్ని న్యూస్,మార్కాపురం (అక్టోబర్ 10): దుర్గాష్టమి పండుగ సందర్భముగా కందుల నాగార్జున రెడ్డి సతీమణి కందుల ప్రమీల దేవి చేతుల మీద డా. కందుల గౌతమ్ నాగి రెడ్డి సౌజన్యంతో 100 మంది సభ్యులకు , హాస్పిటల్ సిబ్బందికి,మహిళలకు పట్టు చీరలు, పురుషులకు పట్టు వస్త్రములు కందుల ఓబుల రెడ్డి హాస్పిటల్ నందు బహుకరించడం జరిగింది. విజయదశమి పండుగ సందర్భముగా అందరికీ మంచి జరగాలని, శరన్నవరాత్రులు ప్రజలందరూ సుఖసంతోషాలతో గడపాలని డా.కందుల గౌతమ్ నాగిరెడ్డి కోరుకున్నారు.విజయ దశమి చెడు మీద మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ పండుగను ఇంటిల్లిపాది సుఖ సంతోషాలతో గడపాలని,అష్ట ఐశ్వర్యాలు,ఆయురారోగ్యాలు సిద్ధించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.





## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

### - ఒకరు మృతి,ఇద్దరికి తీవ్ర గాయాలు

అగ్ని న్యూస్,గిద్దలూరు (అక్టోబర్ 10): జాతీయ రహదారిపై గురువారం బొలెరో, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మొదట తీవ్రంగా గాయపడ్డ ముగ్గురిని అంబులెన్స్ లో గిద్దలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా వెంకటేశ్వర్లు(41) అనే వ్యక్తి మృతి చెందాడు. ఆంజనేయులును నరసరావు పేటకు గురువయ్యను నంద్యాలకు మెరుగైన వైద్యం కోసం తరలించారు.ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## దీపావళి టపాసుల అక్రమ నిల్వలపై పోలీసు దాడులు



### - అనుమతులు లేకుండా నిల్వ ఉంచితే కేసులు నమోదు

### - డిఎస్పీ నాగరాజు

అగ్ని న్యూస్,మార్కాపురం(అక్టోబర్ 10) : ప్రభుత్వ అనుమతులు లేకుండా దీపావళి టపాసులు నిల్వ ఉంచితే కేసులు నమోదు చేస్తామని మార్కాపురం డిఎస్పీ నాగరాజుస్పష్టం చేశారు. పట్టణ సమీపంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ లో దీపావళి టపాసులను అనధికారికంగా భారీ ఎత్తున నిల్వ ఉంచినట్లు వచ్చిన సమాచారం తో దాడులు నిర్వహించి, వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్పీ నాగరాజు,సీఐ సుబ్బారావు, ఎస్ఐ సైదు బాబు లతో కలిసి మీడియాతో మాట్లాడారు. పట్టణం లో ప్రభుత్వ అనుమతి తో రెండు షాపులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇవి కాకుండా ఎవరైనా అనుమతి లేకుండా షాపు నిర్వాహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పారిశ్రామిక వాడలో అక్రమ గోదాం లపై దాడులు చేసి, ఫ్యాక్టరీ యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఇంకా ఎవరైనా ఎక్కడైనా దీపావళి టపాసులు నిల్వ ఉంచితే సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో :
అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి
కేవలం 499/- మాత్రమే only soft copy

## తహసిల్దార్ దాస్ సేవలు మరువలేనివి



### - ఘనంగా నివాళులు అర్పించిన నాయకులు

అగ్ని న్యూస్,యర్రగొండపాలెం (అక్టోబర్ 10): దివంగత తహసిల్దార్ కుక్కమూడి దాసు సేవలు మరువలేనివని పలువురు నాయకులు అన్నారు. ఆయన గుండెపోటు తో మృతి చెందడంతో ఆయన పార్థివ దేహానికి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధ్యతలను ఆయన సక్రమంగా నిర్వహించి పలువురి మన్ననలను పొందినట్లు పేర్కొన్నారు. సమస్యల కోసం కార్యాలయానికి హాజరైన ప్రతి ఒక్కరి సమస్యలను తన కుటుంబ సభ్యుల వలే పరిష్కరించి ప్రజల మదిలో నిలిచారన్నారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కాకర్ల కోటయ్య సెనగ నారాయణరెడ్డి పయ్యావుల ప్రసాద్ బోగోలు వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రతన్ టాటా మృతి దేశ పారిశ్రామిక రంగానికి తీరని లోటు



### - ఎమ్మెల్యే తాటిపర్తి చంద్ర శేఖర్

అగ్ని న్యూస్,యర్రగొండపాలెం (అక్టోబర్ 10): మహాస్వాప్నికుడు, భారతజాతి గర్వించదగ్గ పారిశ్రామిక దిగ్గజం కరోనా మహమ్మారి కష్ట సమయాల్లో దేశ ప్రజలను ఆదుకున్న మహా మానవతావాది, దివంగత రతన్ టాటా అని ఎర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ తెలియజేశారు. తన సంస్థ లాభాల లో 65 శాతం దేశ సంక్షేమానికి ఖర్చు పెట్టిన భరత జాతి ముద్దు బిడ్డ రతన్ టాటా మృతి చెందడం చాలా బాధాకరమని ఆయన తెలియజేస్తూ ఆయన మృతికి తీవ్ర విచారాన్ని, సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తం చేశారు. భారతదేశం ఒక నిజమైన భారతీయుడునీ, దేశభక్తి గల ఒక మహనీయున్ని, సేవా భావం గల వ్యక్తిని కోల్పోయిందని ,అలాంటి వారు సమాజంలో చాలా అరుదుగా ఉంటారని ఆయన అన్నారు. ఆయన నేటి తరానికి, యువ పారిశ్రామిక వేత్తలకు ఆదర్శనీయుడని ఆయన అడుగుజాడలలో నడవవలసిన అవసరం ప్రతి ఒక్కరికి ఉందన్నారు. స్వర్గీయ రతన్ టాటాకి భారతరత్న పురస్కారమిచ్చి కేంద్ర ప్రభుత్వం గౌరవించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## చెంచుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి



### - కలెక్టర్ తమీమ్ అన్సారియా

అగ్ని న్యూస్,యర్రగొండపాలెం (అక్టోబర్ 10):చెంచుల జీవన ప్రమాణాలు మెరుగు పరచడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. యర్రగొండపాలెం మండలం గంజి వారిపల్లె పంచాయతీ, అల్లిపాలెం చెంచు గూడెంలో సార్డ్స్ ఆధ్వర్యంలో 26 లక్షలతో నిర్మించిన బాల ప్రకాశ భవనం ను గురువారం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్ తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాల ప్రకాశ భవనం పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ప్రాంత చెంచుల విద్యా ప్రమాణాలు మెరుగుపర్చేందుకు సార్డ్స్ సంస్థ కృషి అభినందనీయ మన్నారు.చెంచుల జీవన ప్రమాణాలు అభివృద్ధి పరచడానికి, వారికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జన్ మన్ కార్యక్రమం కింద అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. అల్లిపాలెం చెంచు గూడెం లో పర్యటించడం జరిగిందని, పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని గ్రామస్తులు కోరడం జరిగిందని, అలాగే విద్యార్థులు చదువు కునేందుకు వసతి గృహం ను ఏర్పాటు చేయాలని గూడెం ప్రజలు కోరడం జరిగిందని తెలిపారు. గూడెం ప్రజలు తెలిపిన సమస్యలను పరిశీలించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.గంజి వారి పల్లె సర్పంచ్ సుబ్బా రెడ్డి మాట్లాడుతూ,సార్డ్స్ సంస్థ 26 లక్షలతో బాల ప్రకాశ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ అల్లిపాలెం చెంచు గూడెంలో 74 కుటుంబాలు జీవనం సాగిస్తున్నారని, వీరికి పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ గూడెంలో వసతి గృహం లేకపోవడంతో పిల్లలు విద్యకు దూరం గా నిలిచారని కలెక్టర్ కు విన్నవించారు. గంజివారిపల్లె నుండి ఈ గూడెంకు సుమారు ఏడు కిలోమీటర్ల దూరం వుందని, రోడ్డుకు మరమత్తులు చేపట్టాల్సిన అవసరం వుందని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. 40 కుటుంబాలకు అంత్యోదయ కార్డులు మంజూరు చేయాల్సి ఉందని అలాగే కమ్యూనిటి హెల్త్ సెంటర్ ను ఏర్పాటుచేయాలని, సార్డ్స్ వారు నిర్మించిన బాల ప్రకాశ భవనంనకు ఉపాధి హామీ పథకం నిధులతో కాంపౌండ్ వాల్ నిర్మించాలని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా అల్లిపురం చెంచుగూడెం వాసులు పలు సమస్యలను జిల్లా కలెక్టర్ వారి దృష్టికి తీసుకొనివస్తూ వినతులను సమర్పించడం జరిగింది.తొలుత జిల్లా కలెక్టర్, కుడుముల బయన్న ఇంటిని సందర్శించి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. మాకు పక్కా ఇల్లు మంజూరు చేయాలని, అలాగే మా పిల్లలు చదువుకునేలా వసతి గృహం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ను కోరడం జరిగింది.అనంతరం జిల్లా కలెక్టర్ అంగన్ వాడి కేంద్రాన్ని, న్యూట్రి గార్డెన్ ను పరిశీలించడం జరిగింది. మొత్తం ఈ కేంద్రంలో 24 మంది పిల్లలు వున్నారని, ఇందులో 15 మంది పిల్లల వివరాలు ఆన్ లైన్ లో వున్నాయని, 9 మందికి ఆధార్ కార్డు లేక వారి వివరాలు ఆన్ లైన్ లో లేవని, అందువలన వీరికి పోష్టికాహారం అందించడంలో ఇబ్బందిగా ఉంటుందని సిడిపిఓ పద్మ, కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్పందిస్తూ, వెంటనే ఈ గూడెంలో ప్రత్యేకంగా ఆధార్ కేంద్రాన్ని పెట్టి ఆధార్ కార్డు లేనివారి వివరాలు నమోదుచేసి ఆధార్ కార్డులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఎంపిడిఓ ను ఆదేశించారు.కలెక్టర్ వెంట ఎంపిడిఓ శ్రీ శ్రీనివాస రావు, తహశీల్దార్ బాల కిషోర్, చైల్డ్ బిలీవ్ సంస్థ కంట్రీ డైరెక్టర్ నాన్సీ, సార్డ్స్ పిడి సునీల్ కుమార్, ఐసిడిఎస్ సిడిపిఓ పద్మ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో :





# నేత్రపర్వంగా పోలేరమ్మ

అగ్ని న్యూస్,మార్కాపురం(అక్టోబర్ 10): పట్టణ పొలిమేరల్లో కొలువైవున్న గ్రామ దేవత అల్లూరి పోలేరమ్మ దేవస్థానం లో దసరా నవరాత్రులు ఎంతో వైభవంగా సాగుతున్నాయి. గురువారం దేవీ నవరాత్రులలో భాగంగ అష్టమ రోజు శ్రీ మహాకాళి శ్రీ మహాలక్ష్మి శ్రీ మహా సరస్వతి గ్రామ రక్షకి శ్రీ అల్లూరి పోలేరమ్మ దేవి అమ్మవారికి ప్రాతఃకాల సమయంలో పంచామృత అభిషేకం అనంతరం దుర్గా సహస్రనామ కాళికా సహస్రనామం పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగినది. అర్చక స్వాములు పవన్ శర్మ అమ్మవారి మూలవిరాట్ ను నేత్రపర్వంగా అలంకరించారు. ఈఓ ఈదుల చెన్నకేశవ రెడ్డి కార్యక్రమాలు పర్యవేక్షించారు.

# ఏపీలో కొత్త మెడికల్ కళాశాలలకు వీజీఎఫ్!

(అగ్ని ప్రతినిధి, అమరావతి)రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలలకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ఇవ్వడంపై నీతి ఆయోగ్ సానుకూలంగా స్పందించింది. రెండు, మూడు దశల్లో 12 వైద్య కళాశాలలకు వీజీఎఫ్ ఇచ్చేలా హామీ ఇచ్చింది.వీజీఎఫ్ పై నీతి ఆయోగ్ సభ్యుడు వినోద్పాల్ తో మంత్రి సత్యకుమార్ చర్చ జరిపారు.మెడికల్ కళాశాలల నిర్వహణకు ఏడాదికి రూ.200 కోట్ల వ్యయం చేయనున్నారు. కేంద్ర ఆర్థిక సాయంతో పాడేరు, పిడుగురాళ్ల వైద్య కళాశాలల నిర్వహణ జరుపుతారు.

# అప్పుడు పొగిడారు... ఇప్పుడు ఏమయ్యారు...?



(అగ్ని ప్రతినిధి, అమరావతి)

ఏపీలో వైసీపీ నేతల తీరు ఇప్పుడు విమర్శలకు తావిస్తోంది. ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్న సమయంలో పార్టీ అధినేత, నాటి సీఎం జగన్ పైన పొగడ్తల వర్షం కురిపించారు వైసీపీ నేతలు. ఇంటా బయటా, అసెంబ్లీలో, వెలుపలా, పార్టీ కార్యక్రమం, అధికారిక కార్యక్రమం అనే తేడా లేకుండా జగన్ పైన తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. కొందరు నేతలైతే జగన్ మెప్పు కోసం ప్రతిపక్ష నేతలను నోటికి వచ్చినట్లు బూతులు తిట్టారు కూడా. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రులు, కొడాలి నాని, జోగి రమేష్, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి అయితే బహిరంగంగానే నోటీకి వచ్చిన బూతులతో రెచ్చిపోయారు. దీనిపై అప్పట్లో విమర్శలు వెల్లువెత్తినా కూడా ప్రభుత్వం తరపు నుంచి ఎలాంటి ఖండనా రాలేదు. పైగా ఇలా తిట్టిన వారికే కీలకమైన పదవులిచ్చారు జగన్.ఇక కొందరు మహిళా నేతలైతే అసెంబ్లీ వేదికగానే జగన్ కీర్తనలు కూడా పాడారు. మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్ప శ్రీ వాణి టిక్ టాక్ వీడియోలు చేయగా... మాజీ మంత్రి రోజా అయితే ఏకంగా దేవుడి గదిలోనే జగన్ ఫోటో అతికించారు. అయితే ఇదంతా గతం. ప్రస్తుత పరిస్థితి పూర్తిగా విరుద్ధంగా మారిపోయింది.గతంలో పదవులు అనుభవించిన నేతలెవరూ ఇప్పుడు కనీసం మాట్లాడటం లేదు. అప్పుడప్పుడు రోజా మాత్రం వీడియోలో వాయిస్ రిలీజ్ చేస్తున్నారు తప్ప... క్షేత్రస్థాయిలో ఎక్కడా కనిపించడం లేదు. ఇక పుష్ప శ్రీ వాణి అయితే ఎక్కడున్నారో తెలియదు. మాజీ హోమ్ మంత్రులిద్దరూ అడ్రస్ లేకుండా పోయారు. బుల్లెట్ దిగిందా లేదా.. అంటూ అసెంబ్లీ గొప్పగా మాట్లాడిన అనిల్... ఓడిపోతే రాజకీయాలకు గుడ్ బై చెబుతా అంటూ చేసిన సవాల్ మర్చిపోయి మళ్లీ నెల్లూరు వెళ్లిపోయారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్ రెడ్డి కనిపించడం లేదని శ్రీకాళహస్తిలో పోస్టర్లు కూడా వేశారు. ఇక మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వర్రావు,ఉష శ్రీ చరణ్ అయితే పార్టీ మారేందుకు యత్నిస్తున్నారనే పుకార్లు షికారు చేస్తున్నాయి. చివరికి వైసీపీలో నెంబర్ టూ స్థానం కోసం తెగ ప్రయత్నం చేసిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సైతం ఇప్పుడు ఎక్కడా కనిపించటం లేదు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దగ్ధం కేసు తర్వాత పెద్దిరెడ్డి పేరు ఎక్కడా వినిపించటం లేదు. చివరికి సొంత జిల్లాలోని తిరుమల లడ్డూ వివాదంపై కూడా పెద్దిరెడ్డి కనీసం స్పందించలేదు. దీంతో నాడు జగన్‌పై పొగడ్తల వర్షం కురిపించిన నేతలంతా ఇప్పుడు ఏమయ్యారనే ప్రశ్న తలెత్తుతోంది.



# టాటా పార్థివ దేహానికి నివాళులు అర్పించిన సి యం చంద్రబాబు

అగ్ని న్యూస్, ముంబై (అక్టోబర్ 10): రతన్ టాటా పార్థివ దేహానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ లు నివాళులు అర్పించారు. టాటా గ్రూప్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ తో పాటు టాటా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో :
అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి
కేవలం 499/- మాత్రమే only soft copy



# విద్యుత్ దీపాలతో నేత్రపర్వంగా శ్రీశైలం

(అగ్ని ప్రతినిధి,శ్రీశైలం)ప్రముఖ శైవ క్షేత్రం శ్రీశైలం దసరా నవరాత్రి ఉత్సవాలతో అలరారుతుంది. అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటైన శ్రీ భ్రమరాంబ మాత నవరాత్రి ఉత్సవాలలో రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తుంది. రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలతో భ్రమరాంబ మల్లికార్జున సమేత ఆలయాలు దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. స్వామి, అమ్మవార్ల వైభోగాన్ని కళ్ళారా చూసేందుకు  భక్తులు తరలివస్తున్నారు. పౌరాణిక వేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులు అలరారుతున్నారు.

# సూర్యప్రభ వాహనంపై వేంకటేశ్వరస్వామి దర్శనం



(అగ్ని ప్రతినిధి,తిరుమల)తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం ఉదయం స్వామివారు మాడ వీధుల్లో సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం మలయప్ప స్వామి వారు చంద్రప్రభ వాహనంపై విహరించి భక్తులకు అభయం ఇవ్వనున్నారు. చంద్రుడు శివునికి శిరోభూషణమైతే ఇక్కడ శ్రీహరికి వాహనంగా ఉండడం విశేషం.

# బైక్‌ను ఢీకొన్న వాహనం - వ్యక్తి స్పాట్ డెత్



అగ్ని న్యూస్,మార్కాపురం(అక్టోబర్ 10) : మండలం లోని తిప్పాయపాలెం సమీపమున బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీ కొంది. ఈ  ప్రమాదంలో ఓ యువకుడు అక్కడిక్కడే మృతి చెందాడు. మరో యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి.



## వాసవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన

# ఎమ్మెల్యే ముత్తుముల దంపతులు



అగ్ని న్యూస్,కొమరోలు(అక్టోబర్ 10): పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో దేవి నవరాత్రులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, వారి సతీమణి పుష్పలీల పాల్గొన్నారు . వీరికి ఆలయ కమిటీ సభ్యులు, పూజరులు మేళాతాళాలతో ఘన స్వాగతం పలికారు.. ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్ రెడ్డి దంపతులను పూలమాల, శాలువా వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.


# అమ్మవారి శాల లో ఎమ్మెల్యే కందుల పూజలు



## - ఘనంగా స్వాగతం పలికిన కమిటీ సభ్యులు

అగ్ని న్యూస్, మార్కాపురం (అక్టోబర్ 10): దసరా నవరాత్రుల్లో భాగంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి శాల కు వచ్చిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ని అమ్మవారి శాల కమిటీ అధ్యక్షులు చిర్లంచెర్ల బాల మురళి కృష్ణ, కార్యదర్శి సూరె సుబ్బారావు, కోశాధికారి రామడుగు రమేష్ తో పాటు పలువురు కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అర్చకులు జొన్నా భట్ల రాము శర్మ ప్రత్యేక పూజలు చేసి,వేద ఆశీస్సులు అందించారు.





# రతన్ టాటా 1937 - 2024 జీవితం

- టాటా గ్రూపును 10 వేల కోట్ల డాలర్ల సామ్రాజ్యంగా తీర్చిదిద్దారు
- సూది నుంచి విమానం దాకా ఆకాశమే హద్దుగా విస్తరించిన వాణిజ్య విశ్వరూపం తనువు చాలించింది

(అగ్ని ప్రతినిధి,ముంబై)

భారత దేశ పారిశ్రామిక చరిత్రలో ఒక శకం ముగిసింది! జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య యవనికపై తనదైన ముద్ర వేసిన పారిశ్రామిక వేత్త, చైర్మన్ ఎమెరిటస్ ఆఫ్ టాటా సన్స్.. రతన్ నావల్ టాటా (86) ఇక లేరు. వంటగదిలో వాడే ఉప్పు నుంచి.. ఆకాశంలో ఎగిరే విమానాల దాకా.. ఎన్నెన్నో ఉత్పత్తులు, సేవలతో భారతీయుల నిత్యజీవితంలో భాగమైన టాటా సామ్రాజ్యాన్ని రెండు దశాబ్దాలపాటు నడిపించిన ఆ పారిశ్రామిక దిగ్గజం.. మరలిరాని లోకాలకు తరలిపోయారు! రక్తపోటు స్థాయిలు అకస్మాత్తుగా పడిపోవడంతో మూడు రోజుల క్రితం ముంబైలోని బ్రీచ్‌క్యాండీ ఆస్పత్రిలో చేరిన రతన్ టాటా ఆరోగ్య పరిస్థితి విషమించి.. బుధవారం రాత్రి తుది శ్వాస విడిచారు. తన ఆరోగ్యంపై సోషల్ మీడియాలో ఆందోళన వ్యక్తం కావడంతో.. 'నేను బాగానే ఉన్నా.. ఆందోళన వద్దు' అంటూ ప్రకటన చేసిన మూడురోజులకే ఆయన కన్నుమూశారు. టాటా గ్రూప్ వ్యవస్థాపకుడు జంషెట్జీ టాటాకు ముని మనవడైన రతన్ టాటా 1937 డిసెంబరు 28న ముంబైలో జన్మించారు. తల్లిదండ్రులు సూని టాటా, నావల్ టాటా.. ఆయన పుట్టిన పదేళ్లకు విడిపోవడంతో, రతన్ టాటా తన నాయనమ్మ అయిన నవాజ్‌బాయ్ టాటా వద్ద పెరిగారు. ముంబై, సిమ్లాల్లో కొంతకాలం చదివిన అనంతరం.. ఉన్నత విద్యాభ్యాసం నిమిత్తం అమెరికాకు వెళ్లారు. అమెరికాలోని రివర్‌డేల్ కంట్రీ హైస్కూల్‌లో పట్టా పుచ్చుకున్న అనంతరం కార్నెల్ యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్ అండ్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ విద్యను అభ్యసించారు. 1959లో డిగ్రీ పట్టా పుచ్చుకున్న రతన్ టాటా.. 2008లో అదే కార్నెల్ యూనివర్సిటీకి 50 మిలియన్ డాలర్లవిరాళం ఇచ్చారు. ఆ విశ్వవిద్యాలయ చరిత్రలోనే అతిపెద్ద అంతర్జాతీయ దాతగా నిలిచారు. అమెరికాలో పట్టభద్రుడైన అనంతరం.. 1961లో ఆయన టాటా గ్రూపులో చేరారు. తొలుత టాటా స్టీల్‌లో చిరుద్యోగిగా చేరిన ఆయన గ్రూపులోని వివిధ కంపెనీల్లో విభిన్న హోదాల్లో పనిచేశారు. 1971లో నేషనల్ రేడియో అండ్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ డైరెక్టర్ ఇన్‌చార్జిగా.. 1981లో టాటాఇండస్ట్రీస్ చైర్మన్‌గా.. ఇలా పలు బాధ్యతలు నిర్వర్తించారు.ఎంత ఎదిగినా ఒదిగి ఉండే విద్యార్థిలాగా నిరంతరం ఏదో ఒకటి నేర్చుకుంటూ ఉండేవారు. ఈ క్రమంలోనే 1975లో అమెరికాలోని హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ పూర్తిచేశారు. 1991లో జేఆర్‌డీ టాటా అనంతరం టాటా సన్స్ చైర్మన్‌గా పగ్గాలు చేపట్టి.. 2012 డిసెంబరు 28వ తేదీన రిటైరయ్యేదాకా సంస్థను సమర్థంగా నడిపారు. ఆ తర్వాత మళ్లీ 2016 అక్టోబరు నుంచి 2017 ఫిబ్రవరి దాకా తాత్కాలిక చైర్మన్‌గా ఉన్నారు. 1991లో ఆయన పగ్గాలు చేపట్టే సమయానికి టాటా గ్రూప్‌లో ఉన్న కంపెనీల సంఖ్య దాదాపు 250 దాకా ఉండేది. కానీ, ఆయన వాటిని 98కి తగ్గించి సంస్థ సామర్థ్యాన్ని పెంచారు. టాటా గ్రూపు.. హై టెక్నాలజీ వ్యాపారాల్లో ప్రవేశించేందుకు బీజం వేశారు. టాటా గ్రూప్ ఆయన హయాంలోనే 10 వేల కోట్ల డాలర్ల వ్యాపార సామ్రాజ్యంగా అవతరించింది. తన సమర్థ నాయకత్వంలో ఆయన టాటా మోటార్స్, టాటా స్టీల్, టీసీఎస్, టాటా పవర్, టాటా గ్లోబల్ బెవరేజెస్, టాటా కెమికల్స్, ఇండియన్ హోటల్స్, టాటా టెలీ సర్వీసెస్ సంస్థలను అగ్రశ్రేణి సంస్థలుగా తీర్చిదిద్దారు. టీసీఎసను.. దేశంలో వెయ్యికోట్ల డాలర్ల వార్షిక ఆదాయం మైలురాయి దాటిన తొలి భారత ఐటీ కంపెనీగా నిలిపారు. వ్యాపారవేత్తగానే కాదు.. తన ఆదాయంలో 60 నుంచి 65 శాతం మేర వివిధ దాతృత్వ కార్యక్రమాలకు కోసం ఉదారంగా ఇచ్చేసి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు. భారత ప్రభుత్వం ఆయనను 2000 సంవత్సరంలో పద్మభూషణ్‌తో, 2008లో పద్మవిభూషణ్‌తో గౌరవించింది. మరెన్నో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను, గౌరవ డాక్టరేట్లను రతన్ టాటా అందుకున్నారు.బహుముఖ విస్తరణరతన్ టాటా హయాంలో టాటా గ్రూపు దేశ, విదేశాల్లో అనేక కొత్త వ్యాపారాల్లోకి విస్తరించింది. అన్నిటి కంటే ముఖ్యంగా 'ఇండికా' కారును దేశీయంగా అభివృద్ధి చేయడం ద్వారా, భారత ఆటోమొబైల్ కంపెనీలకు సొంతంగా కార్లను అభివృద్ధి చేసే సత్తా లేదన్న ప్రచారానికి ఆయన తెరదించారు. నానో కారు ద్వారా రతన్ టాటా లక్ష రూపాయలకే మిడిల్ క్లాసుకు సొంత కారు భాగ్యం కల్పించారు. అలాగే తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న బ్రిటిష్ లగ్జరీ కార్ల కంపెనీ జాగ్వార్, ల్యాండ్ రోవర్‌ను కొనుగోలు చేయడం ద్వారా, టాటా మోటార్స్ కంపెనీని అంతర్జాతీయ బ్రాండ్‌గా తీర్చి దిద్దారు. బ్రిటన్‌కు చెందిన టెట్లీ టీ బ్రాండ్ కొనుగోలు రతన్ టాటా హయాంలోనే జరిగింది. టాటా స్టీల్ ఉత్పత్తి సామర్థ్యాన్ని భారీగా విస్తరించడంతో పాటు, బ్రిటిష్ స్టీల్ కంపెనీని కొనుగోలు చేసి, టాటా స్టీల్ కంపెనీ కార్యకలాపాలను యూరప్‌కూ విస్తరించారు. ఆయన ప్రారంభించిన వ్యాపారాల్లో నానో కారు, టెలికం వెంచర్లు మాత్రమే అంతగా కలిసి రాలేదు.సైరస్ మిస్త్రీతో వైరంతన తర్వాత టాటా గ్రూప్‌ను సమర్థుడైన వారసునికి అప్పగించాలన్న ఆలోచనతో సైరస్ మిస్త్రీని ఆ పదవికి ఎంపిక చేశారు. కాని వారి బంధం ఎంతో కాలం కొనసాగలేదు. ఆర్థికంగా కంపెనీకి గుదిబండలా మారిన 'నానో' కారు ప్రాజెక్టు ఆపేయాలని మిస్త్రీ చేసిన ప్రయత్నాలకు రతన్ టాటా అడుగడుగునా అడ్డుతగిలారు. తన మానస పుత్రిక అయిన నానో ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లో ఆపకూడదని రతన్ పట్టుబట్టడం వల్లే, మిస్త్రీ టాటా గ్రూప్‌కు దూరమయ్యారని చెబుతారు. టాటా గ్రూప్ చరిత్రలో మొదటిసారిగా పార్సీయేతర వ్యక్తి ఎన్ చంద్రశేఖరన్ టాటా గ్రూప్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం వెనక రతన్‌టాటా మద్దతు ఉంది.

50కి పైగా స్టార్టప్‌ల్లో పెట్టుబడులు

రతన్ టాటా సమర్థుడైన పారిశ్రామికవేత్త మాత్రమే కాదు..తెలివైన పెట్టుబడిదారుడు కూడా. యువ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించే విషయంలో ఆయన ఎప్పుడూ ముందుండేవారు. వ్యక్తిగత హోదాలో ఆయన పేటీఎం, ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ, స్నాప్‌డీల్, లెన్స్‌కార్ట్ సహా 50కి పైగా స్టార్టప్‌ల్లో ఆయన ఇన్వెస్ట్ చేశారు. అవన్నీ అద్భుత విజయాలు సాధించిన సంస్థలే!

ఎయిరిండియా కొనుగోలు

టాటా గ్రూప్ నుంచి ప్రభుత్వ పరమైన ఎయిరిండియాను మళ్లీ టాటాల పట్టులోకి తేవాలన్నది రతన్ టాటా చిరకాల వాంఛ. ఇందుకు అడ్డంకులు ఎదురవడంతో సింగపూర్ ఎయిర్‌లైన్స్, మలేషియా ఎయిర్‌లైన్స్‌తో కలిసి విమానయాన రంగంలోకి ప్రవేశించారు. ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణకు అడ్డంకులు తొలగడంతో 2022లో ఆ సంస్థను మళ్లీ టాటా గ్రూప్ కొనుగోలు చేసింది. పీకల్లోతు నష్టాలతో ఉన్న ఎయిరిండియాను కొనేందుకు ఏ ప్రైవేటు సంస్థా ముందుకు రాలేదు. అయినా తమ గ్రూప్ వ్యవస్థాపకుడు జేఆర్‌డీ టాటా ప్రారంభించిన ఎయిర్ ఇండియాను మళ్లీ తమ పట్టులోకి తేవాలనే ఏకైక లక్ష్యంతోనే ఎయిర్ ఇండియాను రతన్ టాటా కొనుగోలు చేశారు. ఇపుడు ఈ సంస్థ అన్ని బాలారిష్టాలను అధిగమిస్తూ పెద్ద ఎత్తున విస్తరణకు సిద్ధమైంది.

రతన్ టాటా విఫల ప్రేమగాథ!

వ్యాపార దిగ్గజంగా ఎన్నో విజయాలు సాధించిన రతన్ టాటా కూడా ఎంతోమందిలా ఓ లవ్ ఫెయిల్యూరే.. 1962లో భారత్, చైనా దేశాల మధ్య జరిగిన యుద్ధం రతన్ టాటా ప్రేమ విఫలం కావడానికి కారణమైంది. రతన్ టాటా 25 ఏళ్ల వయస్సులో ఉన్నప్పుడు చదువు పూర్తి చేసుకుని అమెరికాలోని లాస్‌ఏంజెల్స్‌లో ఓ ఆర్కిటెక్చర్ కంపెనీలో ఉద్యోగంలో చేరారు. ఆ సమయంలో అక్కడి ఓ మహిళతో ప్రేమలో పడ్డారు. ఆమెను పెళ్లి చేసుకుని అక్కడే స్థిరపడిపోవాలని నిర్ణయించుకున్నారు. అదే సమయంలో ఏడేళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న నాయనమ్మతో కొద్ది రోజులు గడపడం కోసం ఆయన స్వదేశానికి వచ్చారు. తన కోసం తన ప్రేయసి కూడా భారత్ వస్తుందని ఆశించారు. కానీ, భారత్- చైనా యుద్ధంతో ఆ మహిళ తల్లిదండ్రులు ఆమె భారత్ వెళ్లేందుకు అంగీకరించలేదు. దీంతో వారి ప్రేమకథ ముగిసింది ఈ తొలి ప్రేమ ఆయనకు ఓ జ్ఞాపకంగా మిగిలిపోయింది.తన ప్రేమకథను పలుమార్లు బయటపెట్టిన రతన్ టాటా ఆ మహిళ ఎవరనేది ఎప్పుడూ చెప్పలేదు. ఆ తర్వాత 1970ల్లో హిందీ చిత్రసీమలో ప్రముఖ నటీమణిగా వెలుగొందిన సిమీ గరేవాల్‌కు రతన్ దగ్గరయ్యారు. వారి అనుబంధం పెళ్లిపీటల వరకు వెళుతుందని ఆశించినా అది జరగలేదు. సిమీ మరొకరిని పెళ్లాడగా రతన్ టాటా ఒంటరయ్యారు. ఇలా మొత్తం నాలుగు సందర్భాల్లో ఆయన పెళ్లి పీటలు ఎక్కేందుకు సిద్ధమైనా వేర్వేరు కారణాలతో అవేవి జరగక ఆజన్మబ్రహ్మచారిగానే ఉండిపోయారు.

టాటా వారసులెవరు?

రతన్ టాటా మరణంతో ఈ సామ్రాజ్యం పగ్గాలు చేపట్టేందుకు అవకాశాలు, అర్హతలున్న టాటా కుటుంబ వారసుల జాబితాలో నోయెల్ టాటా పేరు ప్రధానంగా చెప్పుకోవాలి. రతన్ టాటా సవతి సోదరుడు నోయల్ టాటా. గ్రూప్ రిటైల్ వర్తక విభాగమైన ట్రెంట్‌తోపాటు పలు వ్యాపారాల్లో ప్రస్తుతం ఆయన క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. నోయెల్ సంతానమైన మాయ, నెవిల్లే, లేహ్ టాటా సైతం పలు టాటా కంపెనీల్లో మేనేజ్‌మెంట్ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

మధ్య తరగతి కారు కల నానో

కారులో ప్రయాణించాలనే భారతీయ మధ్య తరగతి కుటుంబాల కల నెరవేర్చాలని దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటా సంకల్పించారు. ఆయన ఈ సంకల్పమే 'నానో' కారు రూపకల్పనకు దారితీసింది. ఈ కారును 2008లో మార్కెట్‌లోకి తెచ్చారు. కేవలం రూ. 1,00,000 ధరే నిర్ణయించి ప్రపంచంలోనే చౌకైన కారుగా ప్రకటించారు ఇలా అప్పటికి ధనిక వర్గాలకే పరిమితం అయిన కారును మధ్య తరగతి ప్రజలకూ అందుబాటులోకి తెచ్చి వారి కల నెరవేర్చారు. ఈ కారు బయటకు వచ్చాక ఆరంభ కష్టాలు ఎదుర్కొన్నా... ఆటోమొబైల్ మార్కెట్లో సంచలనం సృష్టించింది. ఆటోమొబైల్ పరిశ్రమ కేవలం ఉన్నత వర్గాల కోసమే కార్లను తయారుచేయడం కాకుండా మధ్య తరగతి, దిగువ వర్గాలనూ దృష్టిలో ఉంచుకుని వాహనాలను తయారుచేయాలన్న చర్చకు దారితీసింది. ఈ విషయంలో రతన్ టాటా విజన్ స్పష్టంగా ఉంది... అదేమిటంటే మధ్య తంగతి స్థోమతకు తగ్గ కారును వారి ముందుంచడం... 'నానో'తో ఆయన అది పూర్తిచేశారు.

తక్కువ పెట్టుబడి.
ఎక్కువ భూమి..
అత్యధిక ఆదాయం...

V GROW DEVELOPERS
సిరి క్షేత్రం
ఎర్ర చందనం వ్యవసాయ భూములు

మన మార్కాపురం వాసులచే ప్రారంభించబడిన
మొట్ట మొదటి రెడ్ శాండిల్ వెంచర్స్ కంపెనీ

60 ఎకరాల విస్తీర్ణంలో

కేవలం 746/- కే గజం



సిరి క్షేత్రం
లో పెట్టుబడి తో..
మీ పిల్లల భవిష్యత్తు కు
బంగారు బాటలు వేయండి



మరింత సమాచారం కొరకు సంప్రదించండి
+91 9111 822 822

కంపెనీ డైరెక్టర్స్
మేడం సత్యనారాయణ
దొంతిరెడ్డి వెంకటరెడ్డి
జవ్వాజి సాయికృష్ణ

Printed, Published & Owned by K.V.RAMANA RAO, APTEL 0548/01/1997 SV Printers - Markapur.(K.Rama Krishna- 9441533080/ 8309890844)